సాక్షి సూర్యాపేట

శనివారం । 5 । ఆగస్టు । 2023



'సమీకృతం'పై దృష్టి సారించాలి

రైతులు సమీకృత సాగుపై దృష్టి పెట్టాలని పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం హెడ్ మల్లారెడ్డి సూచించారు. - 10లో



పిలిచి అవమాన పరిచారని..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం జానపద, భజన, కోలాటం కళాకారులు ఆందోళనకు దిగారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
32°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరం జలాల విడుదలకు షెడ్యూల్

అర్వపల్లి: ఎస్సారెస్పీ రెండోదశ పరిధిలోని జిల్లాకు వానాకాలం సీజన్‌కు గాను కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు నీటి పారుదలశాఖ అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. జోన్-2 పరిధిలో ఉన్న సూర్యాపేట జిల్లాకు ఈనెల 9నుంచివారబందీ విధానంలో జలాలను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈనెల 9నుంచి 15వరకు, 23నుంచి 29వరకు, సెప్టెంబర్ 6నుంచి 12వరకు, 20నుంచి 26వరకు, అక్టోబర్ 4నుంచి 10వరకు, అక్టోబర్ 18నుంచి 24వరకు, నవంబర్ 1నుంచి 7వరకు జలాలు రానున్నాయని ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ తెలిపారు.

'క్విట్ ఇండియా' స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్ముతున్న బీజేపీ ప్రభుత్వంపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్మిక సంఘాలు సదస్సులో ఆయన మాట్లాడారు. సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని, విదేశాల్లో ఉన్న నల్లడబ్బును తెచ్చి పేదల ఖాతాల్లో వేస్తానని దేశప్రజలను మోసం చేశారన్నారు. బేటి పడావో, బేటి బచ్చావో, మేకిన్ ఇండియా వంటి ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నిత్యం విదేశీ జపం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక హక్కులను కాలరాశారని వాపోయారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి ప్రభాకర్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, కునుకుంట్ల సైదులు ప్రభాకర్, చొక్కయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బారి అశోక్

సూర్యాపేట టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) వర్కింగ్ ప్రెసిడెంట్ బారి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని 60ఫీట్ల రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దీంతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, కోల కరుణాకర్, నరేష్, యశ్వంత్, ప్రదీప్, నిఖిల్, అరుణ్, గిరి, పవన్, విక్రమ్ పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నారసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ప్రధానాలయ ముఖమండపంలో ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించి కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ముందే సీడీపీ నిధులు

జిల్లాకు రూ.9కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

- గతనెలలో తొలి విడతగా రూ.3 కోట్లు
- ఒక్కో ఎమ్మెల్యేకు రూ.3 కోట్ల చొప్పున నిధుల కేటాయింపు
- ప్రతిపాదనలకు అనుమతులు రాగానే అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం



దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) కింద ప్రభుత్వం ఈ సారి ముందస్తుగానే నిధులిచ్చింది. తాజాగా రూ.9కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణం, అదనపు తరగతి గదులు, టాయిలెట్ల నిర్మాణం తదితర 98 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది.

నాలుగు సార్లు ఇచ్చేవి.. రెండు విడతల్లోనే..

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా సూర్యాపేట నియోజకవర్గంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తిలో గాదరి కిషోర్‌కుమార్, కోదాడలో బొల్లం మల్లయ్య యాదవ్, హుజూర్‌నగర్‌లో శానంపూడి సైదిరెడ్డి ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.3 కోట్ల చొప్పున నిధులు అందనున్నాయి. సీడీపీ నిధులు ప్రతి ఆర్థిక సంవత్సరంలో నాలుగు విడతల్లో అందించేవారు. అయితే గతానికి భిన్నంగా ఈ సంవత్సరం నిధులు ముందస్తుగానే విడుదలయ్యాయి. గత నెలలో ఒక్కొక్కరికీ రూ.75 లక్షల వంతున నలుగురు ఎమ్మెల్యేలకు కలిపి మొత్తం రూ.3 కోట్లు విడుదలయ్యాయి. తాజాగా ఒక్కొక్కరికీ రూ. 2.25 కోట్ల చొప్పున మొత్తం రూ.12 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిధులతో ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రణాళికా సంఘానికి పంపాల్సి ఉంటుంది. ఇచ్చిన ప్రతిపాదనలకు పరిపాలనాపరమైన ఆమోదం లభించిన తర్వాత పనులు చేపట్టనున్నారు.

జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు..

నియోజకవర్గ అభివృద్ధి నిధులను జనాభా ప్రాతిపదికన ఖర్చు చేయాల్సి ఉంటుంది. జిల్లాకు సంబంధించి విడుదలైన నిధుల నుంచి 16.75 శాతం ఎస్సీలకు, 2.65 శాతం ఎస్టీలకు, మిగిలిన నిధులు జనరల్ కేటగిరీల్లో అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎస్సీ కేటగిరీ నిధులను ఎస్సీ కాలనీల్లో, ఎస్టీ కేటగిరీ నిధులను తండాల్లో ఖర్చు చేయాలి. జనరల్ కేటగిరీ నిధులు ఎక్కడైనా ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది.

నిధుల విడుదలతో కొంత ఊరట

నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో ప్రజల నుంచి వివిధ సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యేలకు విజ్ఞప్తులు వస్తుంటాయి. నిధులు అందుబాటులో ఉంటేనే సమస్యలు పరిష్కరించడం, అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతుంది. అయితే నియోజకవర్గ అభివృద్ధి నిధులు విడుదల కావడంతో ఎమ్మెల్యేలకు కొంత ఊరటనిస్తోంది. నియోజకవర్గ అభివృద్ధి నిధులతో దాదాపు 98 రకాల మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టే పనులకు జిల్లా మంత్రి ఆమోదం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు జిల్లా కలెక్టర్ ఆమోదంతో నిధులు విడుదలయ్యేవి. ఈసారి జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి ఆమోదం తప్పనిసరి చేశారు.

తొలి రోజు రెండు టెండర్లు

- మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ ప్రారంభం
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ
- టెండర్లు వేసిన షాపులు రెండూ నేరేడుచర్లకు చెందినవే..



నేరేడుచర్లలోని 82వ మద్యం దుకాణానికి టెండర్ స్వీకరిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత

సూర్యాపేట: జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం శుక్రవారం మద్యం టెండర్లకు నోటిఫికేషన్ వెలువరించి దరఖాస్తుల స్వీకరణకు అనుమతించింది. దీంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలోని కస్తూరిబజార్‌లో గల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రెండేళ్ల కాల పరిమితి (2023-25 సంవత్సరాల) వరకు మద్యం దుకాణాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల ముందుగానే టెండర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.

నేరేడుచర్ల దుకాణాలకు టెండర్లు..

గత సీజన్‌లో 99 దుకాణాలకు 2 వేల దరఖాస్తులు వచ్చాయి. దీంతో దరఖాస్తుల రూపేనా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.40 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో 99 మద్యం దుకాణాలకు తుంగతుర్తి, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శుక్రవారం తొలిరోజు నేరేడుచర్ల పట్టణ కేంద్రంలోని 82వ నంబర్ దుకాణానికి ఒకటి, 84 నంబర్ షాపునకు ఒకటి చొప్పున టెండర్లు వేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా దరఖాస్తులకు డబ్బులు సమకూర్చుకోవడం, సిండికేట్‌గా మారేందుకు సహచరులను జమచేసే పనిలో టెండర్‌దారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. కాగా కొత్త షాపులను దక్కించుకున్న వారు డిసెంబర్ 1నుంచి నిర్వహణ చేపట్టనున్నారు.

18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు



జిల్లాలోని 99 మద్యం దుకాణాలకు ఈనెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సూర్యాపేటలోని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. సూర్యాపేట 30, తుంగతుర్తి 17, కోదాడ 24, హుజూర్‌నగర్ 28 మద్యం దుకాణాలకు టెండర్లను స్వీకరిస్తున్నాం. దరఖాస్తుతో పాటు 3 పాస్ పోర్టుసైజు ఫొటోలు, స్వీయ సంతకం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ పత్రులతో పాటు రూ.2 లక్షల చలానా, జాతీయ బ్యాంకుకు చెందిన డీడీని సమర్పించాలి.

– కె.అనిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, సూర్యాపేట

మోదీ, అమిత్ షావి కుట్రపూరిత రాజకీయాలు

- మాజీ మంత్రి ఆర్డీఆర్

భానుపురి (సూర్యాపేట): కుట్రపూరిత రాజకీయాలు చేయడం ప్రధాని మోదీ, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షాలకు వెన్నతో పెట్టిన విద్య అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి బలం పెరగటంతో ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్ని రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా ఆయన నివాసముంటున్న ఇల్లు ఖాళీ చేయించి అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ విషయంపై సుప్రీం కోర్టును ఆశ్రయించారని, ఈ పరువు నష్టం కేసులో సుప్రీం కోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. రాహుల్‌పై కింది కోర్టు విధించిన శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడం చెడుపై మంచి సాధించిన విజయమని తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలిలో లేబర్‌కార్డు కలిగి ఉన్న మహిళలకు హుజూర్‌నగర్‌లో మూడు నెలలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ ట్రైనర్ తాటికొండ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగినవారు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ఉచితంగా కుట్టుమిషన్‌తోపాటు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) సర్టి ఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో కాని, 9908409884 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

777 మంది వీఆర్‌ఏల సర్దుబాటు

- క్రమబద్ధీకరణలో భాగంగా శాఖల కేటాయింపు
- జిల్లాలో ఖాళీ పోస్టులను గుర్తించిన ఆర్థికశాఖ
- ప్రస్తుతం పనిచేస్తున్న వారు 444 మంది
- మిగతావారు ఇతర జిల్లాల నుంచి వచ్చే అవకాశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్ఏ) వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం విదితమే. వీఆర్ఏల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ, విద్యార్హతను బట్టి వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాల్లో వివిధ శాఖల్లో గుర్తించిన ఖాళీలను ఆర్థికశాఖ శుక్రవారం విడుదల చేయగా ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. దీంతో జిల్లాలో వివిధ శాఖల్లో 777 పోస్టులు ఖాళీగా ఉన్నాయని నిర్ధారించింది. అయితే ఆయా స్థానాల్లో వీఆర్ఏలను శాశ్వత ఉద్యోగులుగా నియమించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం 444 మంది ఉండడంతో మిగతా 333 మందిని ఇతర జిల్లాల నుంచి కేటాయించే అవకాశం ఉంది.

అర్హతను బట్టి పోస్టింగ్

వీఆర్ఎలను ఖాళీలను బట్టి రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం 559 మంది వీఆర్ఏ ఉండాల్సిఉండగా ప్రస్తుతం 444 మందే ఉన్నారు. ఇందులో 2012, 2014 సంవత్సరాల్లో రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 106 మంది నియమితులయ్యారు. మిగిలిన వారంతా వారసత్వ పద్ధతిన కొనసాగుతున్నారు. డిగ్రీ అర్హత కలిగిన వారికి జూనియర్ అసిస్టెంట్, ఇంటర్ వారికి రికార్డు అసిస్టెంట్, పదో తరగతి, అంతకంటే తక్కువ అర్హత కలిగిన వారిని ఆఫీస్ సబార్డినేట్, లస్కర్లుగా నియమించనున్నారు. 61 సంవత్సరాలకు పైపడి వయసున్న వీఆర్ఏలకు వారి కుటుంబ సభ్యులకు వారసత్వ పద్ధతిలో ఉద్యోగం ఇవ్వనున్నారు.

జిల్లాలో కేటాయించిన శాఖలు, క్యాడర్ వివరాలు..

శాఖ	హోదా	కేటాయించిన ఉద్యోగులు	అందనున్న వేతనం (రూ.లలో)
రెవెన్యూ	జూ. అసిస్టెంట్	91	24,280-72,850
మున్సిపల్	వార్డు ఆఫీసర్	51	24,280-72,850
రెవెన్యూ	రికార్డ్ అసిస్టెంట్	108	22,240-67,300
రెవెన్యూ	ఆఫీస్ సబార్డినేట్	55	19,000-58,850
ఇరిగేషన్	లస్కర్, హెల్పర్	334	19,000-58,850
మిషన్ భగీరథ	హెల్పర్	138	19,000-58,850

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

సూర్యాపేట టౌన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సభ్యులు, జిల్లా స్థాయి అధి కారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా : శానంపూడి



నేరేడుచర్ల : తన జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నేరేడుచర్ల, పాలకవీడు మండల కమిటీల ఆధ్వర్యంలో నేరేడుచర్లలో నిర్వహించిన తన జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే స్వయంగా హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. అనంతరం అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు బొకేలు అందజేసి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నేరేడుచర్లలో అన్నదానం నిర్వహించారు. అలాగే నేరేడుచర్ల మండలం బురుగులుతండా సోమప్ప దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, దిష్టపాటి అంజిరెడ్డి, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ బాబు, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు బాషా, అలక సరిత, నాగవేణి, లలిత, ఎంపీటీసీ లింగయ్య, నాయకులు కొణతం సత్యనారాయణరెడ్డి, వల్లంభట్ల రమేష్‌బాబు, ఆకారపు వెంకటేశ్వర్లు, కట్ట కళావతి, కైరూన్, రమాదేవి, నారాయణరెడ్డి, మార్కెండేయ, శ్రీనివాస్, యామిని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, కళ్ల కలక ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, మండల వైద్యాధికారులతో నిర్వహించిన సెల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆహారంలో తాజా కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగించుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమలు ప్రబలకుండా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రధానంగా దోమతెరలు వాడుకోవాలన్నారు. జ్వరం వచ్చినట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. పాము, తేలు కాటు విరుగుడు మందులతో పాటు అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు కళ్లకలక వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలంతా వైద్యసిబ్బందికి సహకరించాలని తెలిపారు.

పోలీస్ పహారాలో మత్స్య సొసైటీ ఎన్నికలు

- రాయినిగూడెం సొసైటీలో తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు 17 మంది పోటీ
- విజయం సాధించిన వాడపల్లి చిననర్సయ్య ప్యానల్



ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు

గరిడేపల్లి: మండలంలోని రాయినిగూడెం గ్రామంలో శుక్రవారం స్థానిక సూరల్‌దేవి చెరువు మత్స్య సొసైటీ ఎన్నికలు భారీ పోలీస్ బందోబస్తు నడుమ సాధారణ ఎన్నికలు తలపించేలా జరిగాయి. ఈ చెరువు సొసైటీలో రాయినిగూడెం, కల్మలపల్లి, ముత్యాలనగర్ గ్రామాల పరిధిలో 95 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో నలుగురు సభ్యులు మృతి చెందగా మిగిలిన 91 మంది సభ్యులు.. తొమ్మిది మంది డైరెక్టర్ల(7 జనరల్ పురుషులు, ఇద్దరు మహిళల)ను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే జనరల్ కేటగిరీలో ముగ్గురు మహిళలతోపాటు 14 మంది పురుషులతో కలిపి మొత్తం 17 మంది పోటీలో ఉన్నారు. ఈ పోటీలో వాడపల్లి చిననర్సయ్య ప్యానల్‌కు చెందిన తొమ్మిది మంది అభ్యర్థులు గెలిచారు. కాగా నర్సయ్య ప్యానల్‌కు పోటీగా ఉన్న తవడబోయిన గురుస్వామి కూడా ఓడిపోవడం గమనార్హం.

గెలుపొందిన అభ్యర్థులు వీరే..

గుండెబోయిన వెంకటనర్సు, గోవింద రామయ్య, గుండెబోయిన రాజ్యం, వాడపల్లి చిననర్సయ్య, షేక్ మధార్ హుస్సేన్, షేక్ అజీత్‌మియా, మస్తాన్, రావుల రామయ్య, పాలవెల్లి లక్ష్మమ్మ గెలుపొందారు. శనివారం ఉదయం 10గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నట్టు ఎన్నికల అధికారి రామచంద్రయ్య తెలిపారు. సహకార సంఘం ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు ప్రొసీడింగ్ అధికారులుగా డి.నాగేశ్వర్‌రావు, అశోక్‌కుమార్ వ్యవహరించారు. హుజూర్‌నగర్ సీఐ రామలింగయ్య పర్యవేక్షణలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, హరికృష్ణ, లింగయ్యతోపాటు 20మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతు బీమాకు ఒక్కరోజే గడువు..

- దరఖాస్తులకు నేడే చివరి తేది
- ఈ ఏడాది చేసుకోని వారు 7వేల మంది
- గతేడాది 40 వేల మంది వరకు..
- ఇప్పటి వరకు నమోదైనవారు 1.51 లక్షలు



ఏఈఓకు రైతుబీమా దరఖాస్తు అందిస్తున్న రైతులు (ఫైల్)

హుజూర్‌నగర్: రైతు బీమా చేయించుకునేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉంది. అయితే అర్హులైన రైతులు బీమా నమోదు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంట్లో భాగంగా గ్రామాల్లో డప్పు చాటింపు, మైకుల ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. అయినా చాలా మంది రైతులు బీమా నమోదుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకం అన్నదాతల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. కుటుంబ పెద్దదిక్కు అయిన రైతు మృతి చెందితే వారి కుటుంబం వీధిన పడకుండా రూ.5లక్షల ఆర్థికసాయం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. రైతుకు సంబంధించిన ఎల్ఐసీ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రమాద బీమా సొమ్మును అందజేస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా ఈమధ్య కాలంలో బీమా చేయించుకోవడంపై రైతులు ఆసక్తి చూపడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

2.80 లక్షల మంది రైతులు..

జిల్లాలో 2.80 లక్షల మంది రైతులు ఉన్నారు. వారిలో 1.51 లక్షల మంది రైతులు రైతుబీమా పథకంలో నమోదై ఉన్నారు. గత ఏడాది 60 వేల మంది రైతులు నూతనంగా పాస్ పుస్తకాలు పొందగా వారిలో 20 వేల మంది దరఖాస్తు చేసుకోగా 40 వేల మంది దరఖాస్తు చేసుకోలేదు. ఈ ఏడాది దాదాపు 12 వేల మంది రైతులు నూతనంగా పాస్‌పుస్తకాలు పొందగా ఇప్పటి వరకు 5 వేల మంది రైతులు మాత్రమే రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 7 వేల మంది రైతులు చేసుకోవాల్సి ఉంది.


ఆగస్టు 14 నుంచి అమలులోకి..

అన్ని ధ్రువపత్రాలతో రైతులు దరఖాస్తు చేసుకుంటే వారి పేరుతో ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తుంది. చెల్లించిన ఆ ప్రీమియం ఆగస్టు 14 నుంచి అమలులోకి వస్తుంది. తిరిగి వచ్చే ఏడాది ఆగస్టు 13న ముగుస్తుంది. ఒకసారి చెల్లించిన రైతు బీమా ప్రీమియం ప్రతిఏటా ప్రభుత్వమే రెన్యూవల్ చేస్తుంది. అయితే జూలై 15న అర్హులైన నూతన పట్టాదారులకు ఉచిత రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అవకాశం కల్పించింది. అయితే ఈ గడువు ఈ నెల 5వ తేదీ(శనివారం)తో ముగుస్తుంది.

దరఖాస్తు ఎలా చేయాలంటే..

రైతులు కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని ధరణి పట్టా చేయించుకోవాలి. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసులోపు గల రైతులు రైతు బీమా పథకానికి అర్హులు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను స్థానికంగా ఉన్న ఏఈఓలకు అందజేయాలి. వారు వ్యవసాయ సైట్‌లో తమ ఐడీ ద్వారా లాగిన్ అయిన తర్వాత సంబంధిత రైతుల వివరాలను నమోదు చేస్తారు. అయితే వీరికి ఎల్ఐసీ ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది.

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలో రైతుబీమాకు అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. శనివారంతో (ఈనెల 5వ తేదీతో) గడువు ముగుస్తుంది. ఈ ఏడాది నూతనంగా పాస్ పుస్తకాలు పొంది అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి. అంతే కాకుండా గత ఏడాది పాసు పుస్తకాలు పొంది దరఖాస్తు చేసుకోని వారు కూడా చేసుకోవచ్చు. ఏఈఓల వద్దకు వెళ్లి దరఖాస్తులను అందజేయాలి.

– డి.రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి మృతి

కనగల్ : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు దుర్మరణం చెందాడు. కనగల్ గ్రామం నుంచి జగతయ్య(55) శుక్రవారం బైక్‌పై క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తన సిమెంట్ షాపునకు వస్తున్నాడు. ఎదురుగా కనగల్ నుంచి ఎం గౌరారం గ్రామానికి చెందిన గోన శ్రీనివాస్‌రావు ఎరువుల బస్తాలు తీసుకుని నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో జగతయ్యను కేజీబీవీ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. జగతయ్య తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తి చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపాడు.

గాయపడిన వ్యక్తి మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఆత్మకూర్ (ఎస్) మండలం పాతసూర్యాపేటకు చెందిన తాటికొండ వెంకట్‌రెడ్డి (55) ఈనెల 1న బైక్‌పై గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న చివ్వెంల మండలం గాయంవారిగూడెం గ్రామానికి చెందిన వీరండి హరి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి.. అక్కడి నుంచి ఈనెల 2న మెరుగైన వైద్యం నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్‌రెడ్డి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు తాటికొండ సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

'ఆజాదీకా అమృత్'కు 'రేగట్టె'కు ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం 75 వసంతాల ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డికి ఆహ్వానం అందింది. రెండో దశ ఉత్సవాల్లో భాగంగా కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 5,6వ తేదీల్లో ఢిల్లీలో గ్రంథాలయాల వేడుకలు జరగనున్నాయి. ప్రారంభ వేడుకలో ప్రతినిధిగా మల్లికార్జున్‌రెడ్డి పాల్గొననున్నారు. లైబ్రరీల అభివృద్ధి, డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించేందుకు ప్రధాని దృష్టికి అనుగుణంగా ఈ వేడుకలను నిర్వహించనున్నారు. అవకాశం కల్పించిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు మల్లికార్జున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు విద్యుత్ మోటార్లు చోరీ

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు రెండు విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మరెడ్డి కిషోర్‌రెడ్డి, అమ్మనబోయిన లక్ష్మమ్మలకు చెందిన విద్యుత్ మోటార్లు ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని కొమరబండ మేజరు కాల్వపై ఉన్నాయి. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ మోటార్లను చోరీ చేశారు. వాటి విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని, శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టరూ..

- కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న దివ్యాంగుడు
- వారం రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే రెండు కిడ్నీలు తొలగించాల్సిందేనంటున్న వైద్యులు
- వైద్యానికి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని వెల్లడి
- చేతిలో చిల్లిగవ్వ లేక దాతలను అర్థిస్తున్న అభాగ్యుడు

అసలే పేదరికం.. ఆపై అవిటితనం. పింఛన్ డబ్బులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆ దివ్యాంగుడి జీవితాన్ని మాయదారి రోగం అతలాకుతలం చేసింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అతను రోజురోజుకీ క్షీణిస్తున్న ఆరోగ్యంతో నరకయాతన అనుభవిస్తున్నాడు. వారం రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే రెండు కిడ్నీలు తొలగించాల్సిందేనని వైద్యులు స్పష్టం చేయడంతో చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు ప్రాణభిక్ష పెట్టాలని అర్థిస్తున్నాడు.

కన్నీటి గాథ

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన మేదరి కులస్తురాలైన పెరసాని సోమమ్మకు దివ్యాంగుడైన వెంకన్న (46) ఒక్కగానొక్క కుమారుడు. ఇతడికి చిన్ననాటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. కొన్నేళ్ల కిందటి వరకు కులవృత్తి (బుట్టలు అల్లడం) చేసుకుంటూ జీవనం సాగించారు. ప్రస్తుతం వృద్ధురాలైన సోమమ్మ, కదలలేక ఏ పనీ చేయలేని వెంకన్న ఆసరా పింఛన్ డబ్బులతో పొట్టపోసుకుంటున్నారు. ఈమె భర్త గతంలో అనారోగ్యంతో మరణించాడు. సోమమ్మ దివ్యాంగుడైన కుమారుడు వెంకన్నను చిన్న పిల్లాడిలా సాకుతూ వస్తోంది.


కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి సోమమ్మ

ఆరు మాసాల క్రితం..

ఆరు నెలల కిందట వెంకన్నకు కిడ్నీల సమస్య ఏర్పడింది. అప్పటి నుంచి ఖమ్మంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటి వరకు అప్పులు తెచ్చి సుమారు రూ.70 వేల వరకు ఖర్చు చేశారు. రెండు కిడ్నీలలో 19 ఎంఎం, 18ఎంఎం రా ళ్లు ఏర్పడ్డాయి. కిడ్నీలలో పెద్ద సైజు రాళ్లు ఏర్పడటంతో ఆరోగ్యశ్రీలో వైద్యం వర్తించదని ఆ ఆస్పత్రి డాక్టర్లు తేల్చిచెప్పారు. ప్రైవేట్‌గానే వైద్యం చేయించుకోవాలని సూచించారు. స్టంట్ వేసి కిడ్నీలకు ఆపరేషన్‌చేసి రాళ్ల తొలగించాల్సి ఉంటుందని,

సాయం చేయాలనుకుంటే..
సోమమ్మ బంధువు నవీన్ ఎస్‌బీఐ
ఖాతా నంబర్: 40655982787
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0018872
ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంలు 9912601454

ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

ఆపరేషన్ చేయించుకోక పోతే..

రెండు కిడ్నీలలో రాళ్లు పెరగడం, కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురికావడంతో వారం రోజుల్లో ఆపరేషన్ చేయించుకోవాలని, లేకుంటే రెండింటినీ తొలగించాల్సి వస్తుందని డాక్టర్లు చెప్పడంతో తల్లీకుమారుడు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆసరా పింఛన్‌తోనే తమ కుటుంబం గడుస్తుందని, ఆపరేషన్‌కు పైసా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు ఆదుకొని ఆపరేషన్‌కు సాయమందించాలని కోరుతున్నారు.

దాతలు ఆదుకోవాలి



నేను దివ్యాంగుడిని. ఆరు నెలల నుంచి కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నా. ప్రస్తుతం రెండు కిడ్నీల్లో రాళ్లు పెరిగి పెద్దవయ్యాయి. వారం రోజుల్లో ఆపరేషన్ చేయించుకోకపోతే కిడ్నీలు తొలగించాలని డాక్టర్లు చెప్పారు. దాతలు ఆదుకొని నా ప్రాణాలు కాపాడాలి.
– వెంకన్న, కిడ్నీ బాధితుడు, అర్వపల్లి

నా కొడుకును బతికించండి



నా కొడుకుకు మతి స్థిమితం సరిగా లేక చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు కంటికిరెప్పలా సాకుతున్నా. దీనికి తోడు ఆరు నెలల క్రితం కిడ్నీల రోగం వచ్చింది. డాక్టర్లు ఆపరేషన్ చేయించకపోతే బతకడని చెప్పారు. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి నా కొడుకును బతికించాలి.
– పెరసాని సోమమ్మ, అర్వపల్లి

ఒక్కరోజు ఎస్ఐ స్వాతి.. ఇక లేదు

- క్యాన్సర్‌తో పోరాడి మృత్యుఒడికి

వ్వెంల(సూర్యాపేట) : ఒక్కరోజు ఎస్ఐగా విధులు నిర్వహించిన ధరావతు స్వాతి ఇక లేదు. కొంత కాలంగా ప్రాంక్రియాటిస్ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆమె గురువారం రాత్రి తుదిశ్వాస విడిచింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని జగనాతండాకు చెందిన ధరావతు స్వాతి (23) డిగ్రీ చదువుతూ కేన్సర్ బారినపడింది. దీంతో ఆమె చిరకాల కోరిక ఎస్ఐ కావాలని ఉండటంతో తల్లిదండ్రులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని కలిశారు. తమ కూతురు కోరికను తీర్చాలని కోరారు. స్పందించిన ఆయన ఒక్కరోజు ఎస్ఐగా విధులు నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మేక్ ఏ విష్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆమెను చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో ఒక్క రోజు ఎస్ఐగా విధులు నిర్వహించేలా నియమించారు. దీంతో ఆమె జూన్ 6వన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి వెళ్లి మంత్రి జగదీష్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.


స్వాతికి ఎస్ఐగా బాధ్యతలు అప్పగిస్తున్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గోపికృష్ణ(ఫైల్)

భువనగిరి : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుతాడి గోపి కృష్ణ(35) మూడు నెలలుగా పట్టణంలోని మారుతీ సుజుకీ పవన్ కార్ల షో రూమ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా విధులు నిర్వహించేందుకు ఈ నెల 3న ఉదయ షో రూమ్‌కు వెళ్లాడు. రాత్రికి ఇంటికి వెళ్లాల్సి ఉంది. కానీ, మరుసటి రోజు ఇంటి వద్ద పని ఉందని రాత్రి విధులు నిర్వహించేందుకు వచ్చిన మరో సెక్యూరిటీ గార్డుకు చెప్పి తానే రాత్రి డ్యూటీ కూడా చేశాడు. ఉదయం విధులు నిర్వహించేందుకు మరో సెక్యూరిటీ గార్డు వచ్చే సరికి షోరూమ్ గేటు మూసి ఉంది. ఎంత పిలిచినా గోపి కృష్ణ రాకపోవడంతో షోరూమ్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న యాజమాన్యం సిబ్బందిని గేటుపై నుంచి వెళ్లాలని సూచించారు. వారు లోనికి వెళ్లి చూడగా అప్పటికే గోపికృష్ణ కారు సీటులో కూర్చొని మృతిచెందినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. గోపికి మూర్ఛ వ్యాధి ఉంది. అనారోగ్య సమస్య, లేదా మరో కారణమా అనే పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.గోపికృష్ణకు భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

వందేభారత్ రైలుపై రాళ్లు విసిరిన ముగ్గురి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: వందేభారత్ రైలుపై రాళ్లు విసిరిన ముగ్గురిని శుక్రవారం రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎంగ్లి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న రాత్రి 9:22 గంటల సమయంలో వందేభారత్ రైలు మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రాగానే సీ11 నంబర్ కోచ్ 3, 4 నంబర్ అద్దాలపై రాళ్లు విసరటంతో పగిలిపోయాయి. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కలేదు. రాళ్ల దాడిని గుర్తించిన రైల్వే సిబ్బంది నల్లగొండ స్టేషన్‌లో రైలు నిలిపిన సమయంలో పంచనామా చేసి విచారణ చేపట్టారు. ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రైలులోని సీసీ కెమరాలను పరిశీలించడంతో పాటు స్థానికంగా తనిఖీలు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించారు. మధ్యప్రదేశ్ నుంచి రైస్ మిల్లుల్లో పనికోసం వచ్చి మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మనోజ్, అభిషేక్, యశ్వంత్‌మీనాలు రాళ్లు విసిరినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నిందితులు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ అశ్వినికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

చెరువులో మునిగి వ్యక్తి మృతి

నిడమనూరు: చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. నిడమనూరులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వీరమల్ల వెంకన్న (63) గురువారం సాయంత్రం 5గంటల సమయంలో చేపలు పట్టేందుకు తెప్పపై స్థానిక చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో గాలివాటానికి తెప్ప తిరగబడడంతో వెంకన్న నీటిలో పడిపోయాడు. అతడి కాళ్లకు వల చిక్కుకోవడంతో నీట మునిగిపోయాడు. గమనించిన తోటి జాలర్లు వచ్చే సరికి వెంకన్న మృతిచెందాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వీరమల్ల శ్రీకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.


నిడమనూరు చెరువులో తెప్పపై వెంకన్న మృతదేహం

ప్రమాదంగా చిత్రీకరించారంటూ..

వీరమళ్ల వెంకన్న గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందగా ఇన్సూరెన్స్ కోసం ప్రమాదంలో మృతిచెందినట్లు చిత్రీకరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ముఠామేస్త్రీ దారుణ హత్య

- బండరాయితో తలపై మోది ఘాతుకం
- హతుడి బైక్ డిక్కీలో కనిపించని రైతుల వద్ద వసూలు చేసిన రూ.లక్షలు
- డబ్బుల కోసమే అంతమొందించి ఉంటారని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామ శివారులో దారుణం


లింగయ్య(ఫైల్)

రామన్నపేట : వ్యవసాయ పనులకు కూలీలను సమకూర్చే ముఠామేస్త్రీ దారుణహత్యకు గురయ్యాడు. రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామ శివారులో శుక్రవారం ఈ ఘటన వెలుగు చూసింది. హత్యోదంతంపై పరిసర గ్రామాల ప్రజలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కాసరబాద సమీప గ్రామం జమునానగర్‌కు చెందిన వానరాశి లింగయ్య(50) వ్యవసాయం, ఇతర పనులకు కూలీలను సమకూరుస్తూ ముఠామేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. తనకు అందుబాటులో ఉన్న కూలీలను పని లభించే ప్రాంతానికి తీసుకువెళ్లి ఉపాధి కల్పిస్తుంటాడు. సుమారు 35రోజుల క్రితం లింగయ్య తన కుటుంబ సభ్యులతో పాటు మరో 40మంది కూలీలతో రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామానికి వచ్చాడు. అక్కడే ఓ రైతుకు చెందిన కోళ్లఫారంలో ఉంటూ నిదానపల్లి, తుమ్మలగూడెం గ్రామాల్లో పలువురి రైతులకు చెందిన పొలాల్లో వరినాట్లు వేయించాడు.


లింగయ్య మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

కూరగాయలు తీసుకొని వెళ్తుండగా..

నాటు వేసే పనులు దగ్గర పడుతుండడంతో కూలీలకు కూలి డబ్బులు చెల్లించడానికి లింగయ్య రైతుల వద్ద నుంచి రావలసిన బకాయిలను వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. గురువారం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కొందరు రైతుల వద్ద రూ.3లక్షల వరకు వసూలు చేశాడు. అనంతరం లింగయ్య నిదానపల్లిలోని ఓ కిరాణషాపులో కూరగాయలు తీసుకొని తన టీవీఎస్ ఎక్సల్‌పై చిట్యాల–భువనగిరిరోడ్డు నుంచి కూలీలు ఉండే చోటుకు బయలుదేరాడు. నిదానపల్లి శివారుకు వెళ్లగానే దుండగులు అతడి తలపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అనంతరం దుండగులు అతని బైక్ డిక్కీలో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. బయటికి వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం పొద్దుపోయే వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు, కూలీలు అతడికి ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. అదేరోజు రాత్రి లింగయ్య కుమారుడు మహేష్ తన తండ్రి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డబ్బుల కోసమే..?

లింగయ్యతోపాటు వచ్చిన కూలీలు తెల్లవార్లు అతని కోసం చెట్టుచేమా వెదికారు. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన తుమ్మలగూడేనికి చెందిన పవన్‌కు తమ పొలం సమీపంలో మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. బండరాయితో తల,వీపుపై బలంగా మోదిన ఆనవాళ్లను గుర్తించారు. భువనగిరి నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. రైతుల నుంచి వచ్చిన కూలి డబ్బులు మొత్తం అతడి వద్ద రూ.10 నుంచి రూ.12లక్షల వరకు ఉంటాయని కూలీలు, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆ డబ్బుల కోసమే దుండగులు లింగయ్యను హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య సైదమ్మతోపాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ, ఏసీపీ మొగులయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారివెంట సీఐ మోతీరాం, ఎస్ఐలు లక్ష్మయ్య, ప్రభాకర్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించి, హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లాపాపలను వదిలి పొట్టచేతపట్టుకుని వస్తే అన్నంపెట్టే దేవుడిని హత్య చేశారని కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు.

చికిత్స పొందుతున్న వీఆర్ఏ మృతి

డిండి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్ఏ మృతిచెందాడు. డిండి మండల కేంద్రానికి చెందిన పోలం శేఖర్ (23) గత నెల 4న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని ముగించుకొని సాయంత్రం తన బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో డిండి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బైక్ పైనుంచి రోడ్డుపై పడిన శేఖర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.


మహిళ అదృశ్యం


బక్కమ్మ (ఫైల్)

మునుగోడు: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన మునుగోడు మండలం పలివెల గ్రామంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పలివెల గ్రామానికి చెందినా రేరంగుల బక్కమ్మకు ముగ్గురు ఆడపిల్లల సంతానం. అందరికీ వివాహాలు చేసింది. రెండో కుమార్తె సబిత రెండు నెలల క్రితం తన భర్తతో తగువుపడి పలివెల గ్రామానికి వచ్చింది. ఈ విషయంలో తల్లీకుమార్తెల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన బక్కమ్మ ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆమె కుటుంబ సభ్యులు తమ బంధువులు, చుట్టూ పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుమార్తె సబిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతి

- ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్‌కు ఎల్‌సీ ఇవ్వడమే ప్రమాదానికి కారణం


గోపి (ఫైల్)

పెద్దవూర: విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతిచెందాడు.ఈ ఘటన పెద్దవూర మండలం జయరాంతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం మాటూరు గ్రామపంచాయతీ దుబ్బతండాకు చెందిన వాంకుడోతు గోపి(30) నాలుగేళ్లుగా పర్వేదుల సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా పనిచేస్తున్నాడు. శుక్రవారం జయరాం తండా రైతుల పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని, పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీంతో గోపి సాయంత్రం నాలుగు గంటల సమయంలో పర్వేదుల సబ్‌స్టేషన్‌లో అక్కడున్న విద్యుత్ ఆపరేటర్‌ను ఎల్‌సీ అడిగాడు. అతను ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చాడు. గోపికి ఎల్‌సీ ఇచ్చానని చెప్పడంతో మరమ్మతులు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. జేఎల్ఎంలు పనిరాని వారిని ఒకరిబదులు మరొకరిని సబ్‌స్టేషన్లలో పెట్టుకుంటున్నారని అందుకే పలుచోట్ల ప్రమాదాలు జరిగి మరణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

ఎర్రవరంలో బైక్‌ల అపహరణ

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలోని దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్ర నరసింహస్వామి ఆలయం వద్ద దుండగులు బైక్‌లను అపహరిస్తున్నారు. భక్తులు ఆలయానికి వేలాదిగా వస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో ఆలయానికి దూరంగా వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో భక్తులు వాహనాలను పార్కింగ్ చేసి దర్శనానికి వెళ్లి వచ్చే వరకు బైక్‌లు మాయం అవుతున్నాయి. ఇప్పటి వరకు 4 బైక్‌లను దొంగలు చోరీ చేశారు. గురువారం ఓ వ్యక్తి బైక్‌ను అపహరిస్తుండగా స్థానికులు పట్టుకొని స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనలపై బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్



పెద్దవూర : పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొంటున్నా రు. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. ఎరువుల వినియోగంలో రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు.


పెద్దవూరలో పత్తి చేనులో కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్న రైతు

పాడి పంట

రసాయనిక ఎరువులతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివలన పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరో వైపు పంట ఉత్పత్తులలో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డి మా ండ్ తగ్గి ధరలు కూడా పడిపోయే ప్రమాదం ఉంది. క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు

- లోతు దుక్కుల వలన భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- సమస్యాత్మక భూముల్లో ముందుగా ఉన్న సమస్యను సరిచేసుకుని ఆ తర్వాత ఎరువులు వేసుకుంటే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపి, యూరియా ఎరువుతో వేప నూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతుంది.
- కోల్‌థార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులు మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువు ల వలన అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకో వడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎ రువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరవులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

వెదజల్లే పద్ధతి.. ప్రయోజనాలు

సరైన పద్ధతిలో ఎరువులు వేయడం ముఖ్యం. సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్లు భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి మేలు చేస్తుంది.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.